క్లుప్తంగా

చైర్‌పర్సన్ తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని శానిటేషన్ సిబ్బంది హాజరు నమోదు కేంద్రాన్ని చైర్‌పర్సన్ సుప్రజ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు హాజరయ్యే పారిశుద్ధ్య కార్మికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

ఆలయంలో పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలను ఏర్పాటు చేశారు. గోవింద నామస్మరణతో దేవస్థానం మారుమోగింది.

సూర్యఘర్ పథకంపై అవగాహన



కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకంపై విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోవూరు డీఈఈ మధుసూదన్‌రెడ్డి, ఏఈ రమేష్ కలిసి పథకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేసీ పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని వవ్వేరు, సంగం మండలంలోని దువ్వూరు గ్రామాల మధ్య ఉన్న భూ వివాదంపై జేసీ కార్తీక్ శుక్రవారం పరిశీలించారు. నకిలీ ఎఫ్ఎంబీ తయారు చేసి ఉండడం వల్ల సబ్ డివిజన్ కూడా సరిగ్గా లేకపోవడంతో జేసీ సైతం ఎలాంటి నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు బాధిత రైతు ఆకుల మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

వావిళ్లలో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

విడవలూరు: మండలంలోని వావిళ్ల గ్రామం ఉప్పలపాడులో పండి రూబేను ఇంట్లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడారు. బాధితుల కథనం మేరకు.. రూబేను తన భార్య రమణమ్మతో కలిసి నెల్లూరులో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ, రెండు రోజులకు ఒకసారి ఇంటికి వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడం గమనించారు. ఇంట్లో పరిశీలింగా బీరువాలో దాచుకున్న రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా పక్కనే మరో రెండు ఇళ్లల్లో కూడా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గ్రామస్తులు గమనించారు. అయితే ఇంటి యజమానులు ఊర్లో లేకపోవడంతో వారు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయి.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): నా భార్యతో గొడవ పడి తల్లి ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియజేయాలని కుమారుడు నెల్లూరు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో షేక్ ముజాహిద్ నివాసం ఉంటున్నారు. ఆయనకు ఆరేళ్ల క్రితం మొహతాజ్‌తో వివాహమైంది. ఐదురోజుల క్రితం అతని భార్య, తల్లి షబానా నడుమ గొడవ జరిగింది. దీంతో భార్యను పుట్టింట్లో వదిలాడు. 18వ తేదీన షబానా ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. బాధిత కుమారుడు గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ మేరకు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువల నిండా పూడిక.. సాగు ఎలా?

- ఆయకట్టుకు నీరందక రైతుల ఇబ్బందులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- చందాలు పోగు చేసి సాగునీటి నిర్వహణ

రైతులకు అవసరమైన పనులు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోంది. చిన్నచిన్న పనుల విషయంలోనూ అశ్రద్ధగా ఉండటంతో అన్నదాతలు అల్లాడిపోతున్నారు. సాగునీటి విషయంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యల గురించి కూటమి పెద్దలకు తెలిసినా తమకేం పట్టనట్టు ఉన్నారు. దీంతో రైతులే స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితులను చక్కదిద్దుకుంటున్నారు.



అధ్వాన స్థితిలో కాలువ

పొదలకూరు: కాలువలు పూడికతో నిండిపోయాయి. ఈ నేపథ్యంలో సోమశిల ప్రాజెక్ట్‌లో నీరున్నా చివరి ఆయకట్టుకు అందక రైతులు నాట్లు కూడా సక్రమంగా వేసుకోలేకపోతున్నారు. కాలువల్లో పూడిక తొలగించి రైతులకు సమస్యలు తలెత్తకుండా నీటిని అందజేస్తున్నట్టు ప్రజాప్రతినిధులు ప్రకటిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మరోలా ఉన్నాయి. అన్నదాతలే చందాలు పోగు చేసి నీటి నిర్వహణ బాధ్యతలను స్వీకరించారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, బత్తులపల్లి, నావూరు తదితర గ్రామాలకు సోమశిల దక్షిణ కాలువ, దాని ఉప కాలువల నుంచి సాగునీరు సక్రమంగా అందడం లేదు. పూడిక తొలగించకపోవడం, అక్రమ విద్యుత్ మోటార్ల వినియోగంతో దిగువ ప్రాంత రైతులకు సవ్యంగా సాగునీరు అందడం లేదు. ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంతోనే ఈ దుస్థితి నెలకొంటున్నట్టు తెలుస్తోంది.

వారే స్వయంగా..

దక్షిణ కాలువ నుంచి మండలంలోని చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, నావూరు, బత్తులపల్లి గ్రామాల ఆయకట్టుకు నీరందించే ఉప కాలువలు దుస్థితిలో ఉన్నాయి. 7ఆర్ కాలువ 26ఎల్ నుంచి చీలి చెన్నారెడ్డిపల్లి రైతుల రబీ సాగునీటి అవసరాలు తీర్చుతుంది. అయితే ఈ కాలువ పూడికతో నిండిపోవడంతో సక్రమంగా నీరు చివరి ఆయకట్టుకు అందడం లేదు. దీంతో వెయ్యి ఎకరాల్లో నాట్లు వేస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను నమ్ముకుంటే పనులు జరగవని భావించి ఎకరాకు రూ.300 వంతున చందాలు పోగు చేసి ఇద్దరు రైతులను రాత్రివేళల్లో గస్తీగా పెట్టుకుని సాగునీటిని సరఫరా చేయించుకుంటున్నారు. 26ఎల్ చేజర్ల మండలం పాతపాడు, ఓబులయపల్లె మీదుగా పొదలకూరు మండలం యర్రబల్లి వరకు ఉంటుంది. ఈ కాలువ పూడికతో నిండిపోయింది. సకాలంలో పూడిక పనులు చేయించకపోవడంతో నీరందడం లేదు. 7ఆర్ (ఏ) కాలువ మండలంలోని భోగసముద్రం చెరువుకు నీటిని అందిస్తుంది. ఇది కూడా పూడికతో నిండిపోవడంతో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ముమ్మరంగా వరినాట్లు

గ్రామాల్లో ఇంకా వరినాట్లు పూర్తి కాలేదు. దక్షిణ కాలువ కింద రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికీ 50 శాతం పైబడి నాట్లు పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. నాట్లు వేసేందుకు మాగాణి భూముల్లో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉండాలి. రాత్రివేళల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న వారు పొలాలకు సాగునీటిని అందేలా చూస్తేనే నాట్లు వేయడం జరుగుతుంది. బోర్ల కింద వరి సాగు చేస్తున్న అన్నదాతలు ముందుగానే నాట్లు పూర్తి చేశారు. కాలువ నీటిపై ఆధారపడిన వారు నెలాఖరు వరకు నాట్లు వేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు.

చందాలు పోగు చేశాం



సాగునీటి నిర్వహణ కోసం నాట్లు వేసుకుంటున్న ప్రతి రైతు నుంచి చందాలు పోగు చేసి మాలోనే ఇద్దరు రైతులను రాత్రివేళ గస్తీగా ఏర్పాటు చేసుకుని సాగునీటిని సరఫరా చేసుకుంటున్నాం. పగటి వేళల్లో సక్రమంగా నీరు అందడం లేదు. రైతులు గస్తీ తిరగడం వల్ల ఇప్పుడు మోస్తరుగా నీరు అందుతోంది. పంట చేతికి వచ్చేంత వరకు ఇదే పరిస్థితి ఉంటుంది.

– వి.మాలకొండారెడ్డి, రైతు, చెన్నారెడ్డిపల్లి



పూడికతో నిండిన దక్షిణ కాలువ 7ఆర్

కాకాణికి అభినందన



కొడవలూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం నెల్లూరులో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు పాల్గొని పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్న కాకాణికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

సర్వేపల్లి ఎమ్మెల్యే పర్యటన

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం విచ్చేశారు. గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కాకు పెంచలయ్య హఠాన్మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 8627 మందికి గానూ 7,853 మంది హాజరయ్యారని, 774 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

దెబ్బతిన్న బ్రిడ్జి.. రాకపోకలకు విఘాతం



చెట్ల కొమ్మలతో ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు – తోటపల్లిగూడూరు మార్గమధ్యలో పంట కాలువపై ఉన్న బ్రిడ్జి దెబ్బతినడంతో వాహన రాకపోకలకు విఘాతం ఏర్పడింది. నరుకూరు సెంటర్ దాటగానే కోడూరు కాలువ బ్రిడ్జి సమీపాన చిన్నపాటి పంట కాలువ వంతెన ఉంది. ఇది శిథిలావస్థకు చేరుకుని మధ్యలో బీటలు వారి కుంగిపోయింది. వంతెన వద్ద కూలిన చోట స్థానికులు కర్రపుల్లతో ప్రమాద సూచిక ఏర్పాటు చేశారు. ఇది రాత్రి పూట కనిపించకపోతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చిట్టి చేతులతో చక్కని చిత్రం



చిత్రాన్ని గీస్తున్న చిన్నారులు



పూర్తయిన తర్వాత ఇలా..

ముత్తుకూరు: మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం అట్ట ముక్కలతో 'ధ్యానం' చిత్రాన్ని రూపొందించారు. శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా తెలుగు పండిట్ సోమా పద్మారత్నం పర్యవేక్షణలో విద్యార్థులు అబ్బురపరిచేలా ఈ చిత్రాన్ని ఆవిష్కరించి పాఠశాలలో ప్రదర్శనకు ఉంచారు.

యూరియా కోసం పడిగాపులు



గోదాము ఎదుట బారులు తీరిన రైతులు

బుచ్చిరెడ్డిపాళెం: మండల వ్యవసాయాధికారులు యూరియా కొరత లేదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ గోదాము వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. రైతులకు ముందు రోజు స్లిప్పులు ఇచ్చి తరువాత రోజు లేదని చెప్పడం గమనార్హం. ఈ విషయమై బ్యాంక్ సిబ్బందికి, రైతులకు ఘర్షణ వాతావరణం ఏర్పడినట్లు తెలుస్తోంది. గతేడాది నుంచి వవ్వేరు బ్యాంక్‌లో ఎరువుల గోల్‌మాల్ అధికంగా ఉన్నట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘంలో బస్తా రూ.266లకు లభిస్తుండగా ప్రైవేట్ దుకాణాలలో రూ.300 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కొరత లేదు



మండలంలో యూరియా కొరత లేదు. ఇప్పటికే నాలుగు వేల బస్తాలు రెడ్డిపాళెం, బుచ్చిరెడ్డిపాళెం కో–ఆపరేటివ్ బ్యాంక్, రేబాల, దామరమడుగులో ఉంది. ఇతర మండలాల వారు వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్‌కు రావడంతో యూరియా ఎప్పటికప్పుడు అందించే విషయంలో వెనుకబడ్డాం. అయినా రైతులకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేసేందుకు కృషి చేస్తాం.

– సురేంద్రరెడ్డి, మండల వ్యవసాయాధికారి

మండల సర్వసభ్య సమావేశం నేడు

పొదలకూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ డీపీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

కమ్మేసిన ముసురు.. రైతుల ఆందోళన

పొదలకూరు: అల్పపీడన ప్రభావంతో ముసురు వాన వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కూలీలు రాక నాట్లు పూర్తి చేయలేకున్నారు. నిమ్మ రైతులు కాయల కోసేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తరచూ ముసురు కమ్మేసి రైతులను వేధిస్తోంది. ఈ ప్రాంతంలో నిమ్మ సాగుపై ఆధారపడిన రైతులు జడివాన, ముసురు వల్ల తోటలకు చీడపీడలు అధికమై పెట్టుబడులు పెరుగుతున్నట్లు వాపోతున్నారు. శుక్రవారం కాసేపు ఎండ వచ్చింది. వెంటనే ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ఒక్కసారిగా చల్లిటిగాలులతో ముసురు పట్టుకోవడంతో ఇలాంటి వాతావరణం వల్ల పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జయప్రదం చేయండి

కోవూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కోవూరులోని పార్టీ కార్యాలయం వద్ద శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ శ్రేణులు శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

పొదలకూరు: ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం పొదలకూరు సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఆఫీస్‌లో వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన కేసుల గురించి ఆరా తీశారు. కండలేరు డ్యామ్‌కు వెళ్లే మార్గమధ్యలో పొదలకూరులో ఎస్పీ ఆగారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్): నేరస్తులపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం డీఎస్పీ చిన్నబజారు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నేరనియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండగల సందర్భంగా దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పగటి, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సురేంద్రబాబు



నియామకపత్రాన్ని అందుకుంటున్న సురేంద్రబాబు

తోటపల్లిగూడూరు: వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కోవెరపాళెం గ్రామానికి చెందిన సీనియర్ నేత తలమంచి సురేంద్రబాబు నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో శుక్రవారం ఆయన నెల్లూరులో నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. కాకాణికి మంచిపేరు తెచ్చే విధంగా నడుచుకుంటానన్నారు.

పంట కాలువ ఆక్రమణను తొలగించండి



మనుబోలు: అర్జీ స్వీకరించిన తహసీల్దార్



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..

- రెవెన్యూ సదస్సుల్లో రైతుల వినతి

మనుబోలు: పంట కాలువ ఆక్రమణలను తొలగించాలని రైతులు తహసీల్దార్ సుబ్బయ్యను కోరారు. శుక్రవారం మండలంలోని పర్లపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఇందులో వినతిపత్రం అందించిన అనంతరం రైతులు మాట్లాడుతూ పర్లపాడు గ్రామానికి సాగునీరు సరఫరా అయ్యే పంట కాలువను కొందరు ఆక్రమించడంతో దిగువ ప్రాంతంలో ఉన్న పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని వాపోయారు. సదస్సులో పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగళ్లో పేర్ల నమోదు తదితర సమస్యలపై అర్జీలు అందాయి. సర్వేయర్ శ్రీనివాసరావు, ఎండోమెంట్ ఈఓ ఉమ, వీఆర్వో నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

కొడవలూరు: రెవెన్యూ సదస్సుల్లో అన్ని శాఖల వినతులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ కె.స్ఫూర్తి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం, రామన్నపాళెంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, ప్రియదర్శిని, మల్లికార్జున, విలేజ్ సర్వేయర్‌లు సంతోష్, మహేంద్ర, సుధామణి పాల్గొన్నారు.

వెంకటాచలం రోడ్డు గుల్ల



దెబ్బతిన్న రోడ్డు



చెడిపోయి నిలిచిపోయిన బల్కర్

ముత్తుకూరు: భారీ వాహనాల రాకపోకలతో ముత్తుకూరు – వెంకటాచలం మధ్య బలిజపాళెం రోడ్డు దారుణంగా మారింది. సామర్థ్యానికి మించి టిప్పర్లు, లారీలు, బల్కర్లు ప్రయాణించం వల్ల గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు నీరు నిలిచిపోవడంతో గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం గండంగా మారింది. శుక్రవారం సిమెంట్ బల్కర్ చెడిపోయి నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుంతలను పూడ్చకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాల పూర్తి



సమీక్ష నిర్వహిస్తున్న డీఈ

మనుబోలు: మార్చిలోగా పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ జహీరుద్దీన్ తెలిపారు. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన గృహ నిర్మాణ శాఖ ఏఈ, సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో బీఎల్, రూఫ్ లెవెల్, స్లాబ్ లెవెల్లో సుమారు 300 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. వీటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ జలజాక్షి, హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శరత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.